సాక్షి
మంచిర్యాల
శనివారం ၊ 3 ၊ మే ၊ 2025



కలియ దున్నితే భూసారం
వరి కోతలు పూర్తవుతున్నాయి. రైతులు వానా కాలం సాగుకు సమాయత్తం అవుతుండ గా.. వరి కొయ్యలను కాల్చకుండా కలియ దున్నాలని సూచిస్తున్నారు. 10లో▸



కొనుగోళ్ల బాధ్యత ఆమెకే..
జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయం సహాయక సంఘాల మహిళలే నిర్వహిస్తున్నారు. కేంద్రాల నిర్వహణతో వచ్చే కమీషన్‌తో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.0 /27.0
ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వడగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

రైతులు ఆందోళన చెందవద్దు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. పంటలు దెబ్బతిన్న విషయాన్ని తెలుసుకుని సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి, మిర్చి, మామిడి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలను సమగ్రంగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఆదేశించినట్లు తెలిపారు. నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి నష్ట పరిహారం ఇప్పిస్తాని భరోసానిచ్చారు.

ఆర్టీసీ డీఎంగా శ్రీనివాసులు



డీఎం శ్రీనివాసులును సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు డీఎంగా విధులు నిర్వర్తించిన జనార్దన్ పదవీ విరమణ పొందారు. వరంగల్ డిపో–1లో అసిస్టెంట్ ఇంజనీర్(మెకానిక్) శ్రీనివాసులు పదోన్నతిపై మంచిర్యాల డీఎంగా వచ్చారు. ఆయనను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎంఎఫ్ సుధాకర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల తదితరులు పాల్గొన్నారు.

5నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

బెల్లంపల్లి: పంటల సాగులో ఉత్పన్నమవుతున్న ప్రతికూల పరిస్థితులు, ఆధునిక పద్ధతులు, ఎరువులు, విత్తనాలు, నేల స్వభావం, వ్యవసాయ పరిజ్ఞానం తదితర అంశాల్లో రైతులకు అవగాహన కల్పించడానికి ఈ నెల 5 నుంచి జూన్ 13వరకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన బృందంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ నుంచి ఇద్దరు అధి కారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఇద్దరు, అభ్యుదయ రైతులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఉంటారని తెలిపారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్కారు బడుల్లో వేసవి శిక్షణ శిబిరాలు

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల్లో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఉన్నత పాఠశాలల్లో 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15రోజులపాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగ, ధ్యానం, చెస్, డ్యాన్స్, ఇండోర్‌గేమ్స్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్ పాఠాలు, సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇస్తారు. జిల్లాలో 50 పాఠశాలలు ఎంపిక చేయగా.. రూ.50వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి. విద్యార్థుల అల్పాహారానికి రూ.15వేలు, మెటీరియల్ కోసం రూ.10వేలు, శిక్షకులకు రూ.3వేల చొప్పున చెల్లిస్తారు. పాతమంచిర్యాల ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన శిక్షణ శిబిరంలో ఎంఈవో మాలవీదేవి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బాయ్స్, గరల్స్ హైస్కూల్‌లో నీట్ పరీక్షల కారణంగా శిబిరాలు ఆలస్యంగా ప్రారంభం కానున్నాయి.

నేటి నుంచి కేజీబీవీల్లో..

మంచిర్యాలఅర్బన్: నస్పూర్‌లోని కేజీబీవీలో విద్యార్థినులకు ఈ నెల 3నుంచి 17వరకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థినులు 200మంది పాల్గొంటారు. వివిధ అంశాలు నేర్పిస్తారని సెక్టోరల్ అధికారి యశోధర తెలిపారు. అల్పాహారం, డిన్నర్‌కు రూ.1.96లక్షలు కేటాయించారు.

గాలి వాన బీభత్సం

- నేలరాలిన మామిడి
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- కూలిన ఇళ్ల పైకప్పులు
- 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో కురిసిన వర్షం

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
భీమారం	23.8
నెన్నెల	21.3
చెన్నూర్	12.3
జైపూర్	10.8
భీమిని	9.1
కన్నెపల్లి	6.5
కోటపల్లి	6.5
వేమనపల్లి	2.2



జైపూర్: కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యం



భీమారం మండలంలో కింద పడిపోయిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్



జైపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు, రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన వరి ధాన్యం, మిర్చి, మొక్కజొన్న పంటలను నీట ముంచేసింది. దిగుబడి దశలో ఉన్న మామిడి నేలరాలింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీగా నష్టం వాటిల్లింది. జిల్లాలో 5.2మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నెన్నెల, భీమారం, జైపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఇళ్లపై రేకులు ఎగిరిపోయి రూ.30లక్షల నుంచి రూ.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బలమైన ఈదురుగాలులతో చెట్లు విరిగి ఇళ్లు, రోడ్లు, విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో 33కేవీ లైన్ స్తంభాలు 5, 11కేవీ లైన్ స్తంభాలు 92, ఎల్‌టీ స్తంభాలు 99, ట్రాన్స్‌ఫార్మర్లు 14 నేలకూలాయి. విద్యుత్ శాఖకు రూ.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. జైపూర్, భీమారం, నెన్నెల, బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు విరిగి, తీగలు తెగిపడి నష్టం తెచ్చిపెట్టాయి. గురువారం రాత్రి నుంచి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా.. శుక్రవారం మధ్యాహ్నం వరకు పనులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసింది.

జిల్లాలో పంట నష్టం

జిల్లాలో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల నష్టాన్ని శుక్రవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక సర్వేలో గుర్తించారు. నెన్నెల, భీమారం, జైపూర్ మండలాల్లో 83మందికి చెందిన కోత దశలో ఉన్న వరి పంట 133ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు. 1386 ఎకరాల్లోని మామిడి తోటల్లో 33శాతం పైబడి నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. చెట్లకొమ్మలు విరగడంతోపాటు వేర్లతో నేలకు వంగడం, కాయలు నేలరాలినట్లు తేల్చారు.

నేలకొరిగిన వరి పంట

నెన్నెల/భీమిని: నెన్నెల మండలం గంగారాం, నెన్నెల, కొత్తగూడం గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. చిత్తాపూర్, నార్వాయిపేట, ఆవుడం, గంగారాం, చిన్నవెంకటాపూర్, మైలారం, గొల్లపల్లి గ్రామాల్లో 800 ఎకరాల్లో మామిడికి, 300 ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గంగారాం, చిన్నవెంకటాపూర్, పొట్యాల, కొంపల్లిలో కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగి ధాన్యం రాలింది. విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో 16గంటలపాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ ఏఈ రాజన్న సిబ్బందితో కలిసి మరమ్మతులు చేసి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి గోడలు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలి రోడ్లపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రూ.లక్షల్లో నష్టం ఏర్పడిందని, అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

☞ ఒక్కసారిగా గాలివాన రావడంతో కన్నెపల్లి మండలం లింగాల గ్రామంలో జంపాల అంజన్న రేకుల టేల ఎగిరి ఇంటిపై పడింది. ఇంటిపై ఉన్న రేకులు పగలడంతో నష్టం జరిగింది. చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. రాంపూర్ రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



నెన్నెలలో రాలిన మామిడి కాయలను కుప్ప పోస్తున్న రైతులు

తడిసిన ధాన్యం



లింగంపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

చెన్నూర్‌రూరల్: మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. లంబడిపల్లి, లింగంపల్లి, అక్కెపలి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యంపై కవర్లు కప్పారు. కొన్ని చోట్ల కవర్లపై నీరు చేరి కొంత మేర ధాన్యం తడిసింది. వర్షపు నీరు చేరడంతో రైతులు నీటిని ఎత్తి పోస్తున్నారు. ఆకాశంలో మబ్బులు అలాగే ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి. శుక్రవారం వాటిని తొలగింపజేశారు.

అపార నష్టం



భీమారంలో నేల రాలిన మామిడి కాయలు ఏరుతున్న కూలీలు

భీమారం: మండలంలో వర్షానికి అపార నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కోతలకు వచ్చిన వరిపంట నేలవాలింది. భీమారం–నెన్నెల ప్రధాన రహదారిలో కొత్తగూడెం నుంచి నర్సింగాపూర్ వరకు పెద్ద ఎత్తున చెట్లు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చెట్లను ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. బూర్గుపల్లి, కాజిపల్లి, భీమారం, నర్సింగాపూర్ గ్రామాల్లో పంట నష్టం అధికంగా ఉంది. ఇళ్లపై ఉన్న రేకులు లేచిపోయి చాలా దూరంలో పడ్డాయి. దీంతో కాజిపల్లి గ్రామానికి చెందిన బాధితులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. బూర్గుపల్లిలోని పలు తోటల్లో 40 ఏళ్ల వయస్సు గల మామిడి చెట్లు వేళ్లతో సహా పడిపోయాయి. ప్రభుత్వం నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జైపూర్: మండలంలో గురువారం రాత్రి భారీ ఈదురుగాలుల వర్షానికి మామిడి కాయలు నేలరాలయి. కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాల్లో కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. రోడ్డు వైపు ఉన్న పెద్దపెద్ద చెట్లు నెలకొరిగాయి. కిష్టాపూర్, శివ్వారం, పౌనూర్‌లో రేకులతో నిర్మించుకున్న ఇళ్లపై కప్పులు ఎగిరిపోయాయి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన వరి ధాన్యం తడిసింది.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, నాగారం గ్రామాల్లో తోటల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. కోతకు వచ్చిన వరి పైరు నేలవాలగా.. పలు గ్రామాల్లో కళ్లాల్లోని ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా అవస్థలు పడ్డారు.



భీమారం–నెన్నెల ప్రధాన రోడ్డుపై పడిపోయిన చెట్లు

'బంగారు' కావ్య

- ఎంబీబీఎస్‌లో ఆరు గోల్డ్‌మెడల్స్
- పూర్తయిన వైద్య విద్య

బెల్లంపల్లి: కృషి.. పట్టుదల ఉంటే ఎంత కష్టమైనా సునాయాసంగా విజయాన్ని అందుకోవచ్చని ఆ యువతి నిరూపించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వైద్య విద్యలో ఆరు బంగారు పతకాలు సాధించింది. బెల్లంపల్లికి చెందిన దుర్గం కావ్య ఈ నెల ఒకటిన హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ ఏ.నరేంద్ర చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంది. అంతకుముందు గాంధీ మెడికల్ కళాశాల నుంచి ఐదు గోల్డ్‌మెడల్స్ అందుకోవడం గమనార్హం.

చదువులో మేటి

పట్టణంలోని షంషీర్‌నగర్ బస్తీకి చెందిన దుర్గం విజయ, రామకృష్ణ దంపతుల పెద్ద కూతురు కావ్య చిన్నప్పటి నుంచే చదువులో మేటిగా రాణిస్తోంది. తండ్రి ఆర్‌బీఎస్‌కేలో మెడికల్ ఆఫీసర్ కాగా, తల్లి గృహిణి. 2017లో పదో తరగతిలో 9.7జీపీఏ సాధించి ప్రతిభను చాటుకుంది. 2017–19లో హైదరాబాద్‌లోని కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీలో 986మార్కులు సాధించింది. అదే సీజన్‌లో నీట్ రాసి 559మార్కులతో 20165 ఆలిండియా ర్యాంకు, తెలంగాణలో 800 ర్యాంకు దక్కించుకుంది. దీంతో గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఇటీవల పూర్తి చేసి పట్టా అందుకుంది.

ఆరు పతకాలు

ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరంలో కావ్య టాపర్‌గా నిలిచి బంగారు పతకం అందుకుంది. ఫైనల్ ఇయర్‌లోనూ టాపర్‌గా నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. అదే తీరుగా ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ మెడిసిన్‌లో టాపర్‌గా నిలిచి రెండు బంగారు పతకాలు అందుకుంది. ఫైనల్ ఇయర్‌లో ఓవరాల్ టాపర్‌గా నిలువడంతోపాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లోనూ ఆమె ప్రతిభావంతంగా రాణించడంతో మరో రెండు గోల్డ్‌మెడల్స్ దక్కించుకుంది. వైద్య విద్య పూర్తయ్యే సరికి ఏకంగా ఆరు పతకాలు సాధించి సరస్వతీ పుత్రికగా పేరొందింది.



నందకుమార్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న కావ్య

పేదలకు వైద్య సేవలు

జనరల్ మెడిసిన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) చేయాలనేది నా లక్ష్యం. ఆ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో వైద్యసేవలు అందించాలని అనుకుంటున్న. ఏ రంగంలో పని చేసినా పేదలకు నావంతు ఉచితంగా వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తాను. బెల్లంపల్లి ప్రాంతంలో వైద్య వృత్తిని చేపడతాను. ప్రస్తుతం వైద్యం ఎంతో ఖరీదైంది. వైద్యవిద్యను పూర్తి చేసి పేదల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రయత్నిస్తాను.

– దుర్గం కావ్య, ఎంబీబీఎస్

వాహన అనుమతిపై సందిగ్ధం

- పది రోజులుగా యజమాని పరేషాన్
- ఆర్టీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారీ వాహనాల అనుమతిలో కంపెనీ పేర్కొన్న.. రవాణా శాఖ అధికారులు ఇచ్చే అనుమతుల్లో తేడాలు వస్తున్నాయి. జిల్లాలోని కోటపల్లి మండలం కొల్లూరుకు చెందిన జంగా రమేశ్‌రెడ్డి ఆరు టైర్ల ఇంజన్ కలిగిన ఐదు భారీ వాహనాలు కొనుగోలు చేశారు. ట్రైలర్‌తో కలిపి 22టైర్ల డబుల్ క్రోన్(టైర్ల సస్పెన్షన్) వాహనానికి జీవీడబ్ల్యూ(గ్రాస్ వెయిట్ వెహికిల్) 55టన్నులు(ఖాళీ ఇంజిన్, మోసే బరువు సహా) సామర్థ్యం అనుమతి ఇచ్చారు. మరో 18టైర్ల సింగిల్ క్రోన్ నాలుగు వాహనాలకు 54టన్నులు అనుమతి కోరితే, స్థానిక ఎంవీఐ తనిఖీ చేసి 45.5టన్నులకే అనుమతి ఇచ్చారని తెలిపారు. వాహన కంపెనీ ప్రతినిధులు 54టన్నుల జీవీడబ్ల్యూతో ఎస్టీఏ(స్టేట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) అనుమతి ఉందని చెబితేనే కొనుగోలు చేశానని, గత పది రోజులుగా యజమాని ఆర్టీఏ అధికారులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. నిబంధనల మేరకే సామర్థ్య అనుమతి ఇచ్చామని, ఏదైనా జీవో ఉంటే తీసుకు రావాలంటూ డీటీవో సంతోశ్ కుమార్ యజమానికి సూచించారు. దీంతో ఆ యజమాని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలోనూ సంప్రదించగా, ఇంకా ఈ వాహనాల సామర్థ్యాలపై ఎలాంటి స్పష్టత రావడం లేదు. వాహన తయారీ కంపెనీ ప్రతినిధులు ఎస్టీఏ నుంచి నిర్ణీత సామర్థ్యానికి అప్రూవ్ ఉందంటున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేశానని, డీడీలకే రూ.6లక్షలకు పైగా చెల్లించానని, తీరా అనుమతి రాకపోతే నష్టపోతానని యజమాని వాపోతున్నారు. దీనిపై డీటీవోను 'సాక్షి' వివరణ కోరగా, నిబంధనల మేరకే అనుమతులు ఇచ్చామని, మరోసారి పరిశీలిస్తామని తెలిపారు. సాధారణంగా ఆర్టీఏ అధికారులు వాహన ఇంజన్, టైర్లు, సింగిల్, డబుల్ క్రోన్ సామర్థ్యాలు, ముందు, వెనక భాగాల్లో నిర్మాణం, ట్రైలర్ అమరిక, సాంకేతికత, తదితర పరిశీలించి, ఎస్టీఏ ప్రకారం సామర్థ్య అనుమతులు జారీ చేస్తారు. ఆమేరకే వాహనాల్లో లోడింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.



అనుమతి కోసం వచ్చిన వాహనాలు

రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా ఈ నెల 5నుంచి 20వరకు జిల్లాకు ఒక మండలంలో రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, సీట్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. జూన్ 2 వరకు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భీమారం మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, గృహ నిర్మాణ ప్రాజెక్టు అధికారి బన్సీలాల్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

మందమర్రిరూరల్: రైస్‌మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంబికాసాయి, వాసవి, లక్ష్మీగణపతి, వెంకటేశ్వర రైస్‌మిల్లులను తహసీల్దార్ సతీష్‌కుమార్‌శర్మతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం లారీలను లోడ్‌తో గంటల తరబడి వేచి ఉంచొద్దని, అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని, వెంటనే అన్‌లోడ్ చేసి పంపించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సందర్శించారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, బయటకు వెళ్తే టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



రైస్‌మిల్లర్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కరీంనగర్ జిల్లా మిల్లులకు ధాన్యం తరలింపు

సాక్షి ఎఫెక్ట్

మంచిర్యాలఅగ్రికల్చర్: 'బస్తా దిగదు.. బండి కదలదు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం సేకరణ వేగవంతంతోపాటు లోడింగ్, అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం అన్‌లోడ్ కాక రోజుల తరబడి అక్కడే ఉంటున్నాయని కథనంలో ప్రస్తావించడం తెలిసిందే. అన్‌లోడ్ సమస్య పరిష్కారానికి పక్క జిల్లాలోని మిల్లులకు తరలించాలని సివిల్ సప్లయి అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి కరీంనగర్ జిల్లాలోని 26 రైస్‌మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చి ధాన్యం తరలిస్తున్నారు. ఇప్పటివరకు 3,371 మంది రైతుల నుంచి 30,516.160 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మిల్లులకు 20,407.400 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించగా.. ఇంకా 10,108.760 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉంది.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- జెడ్పీ సీఈవో గణపతి
- ఎంపీడీవో, ఎంపీవో, సూపరింటెండెంట్‌కు నోటీసులు

మందమర్రిరూరల్: విధుల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈవో గణపతి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో రాజేశ్వర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందే విధంగా నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం, సంక్షేమ ఫలాల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఉదయం 10గంటలకు కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినప్పుడు ఎంపీడీవో, ఎంపీవోతోపాటు సిబ్బంది కూడా లేరు. దీంతో సమయపాలన పాటించలేదని ఎంపీడీవో, ఎంపీవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఎనిమిది మంది ఆఫీస్ సిబ్బందితోపాటు ఉపాధి హామీ సిబ్బందికి జెడ్పీ సీఈవో గణపతి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.



రికార్డులు తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో గణపతి

క్లుప్తంగా

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు రాజీనామా

మంచిర్యాలఅర్బన్: టీజీఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శి పదవికి భీమేశ్వర్‌రావు శుక్రవారం రాజీనామా చేశారు. గతంలో కార్మికుల సమ్మె తర్వాత వారి అనేక సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యలపై నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శికి రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. శుక్రవారం వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు అనంతరం నది ఒడ్డున శివాలయంలో భక్తులు పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులకు అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. అనంతరం శ్రీ జ్ఞాన సరస్వతి, మహాంకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గోదావరికి హారతి



హారతి ఇస్తున్న వేద పండితులు

బాసర: బాసరలో గోదావరి నదికి శుక్రవారం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ వేద భారతి పీఠం, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోదారమ్మ తల్లికి పూజలు చేశారు. వేద పాఠశాల విద్యార్థులు పంచ, నాగ హారతిని ఇచ్చారు. వేద విద్యానంద గిరిస్వామి, భక్తులు తదితరులు ఉన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శుక్రవారం ఆటోలో మంటలు చెలరేగి దగ్ధమైంది. భైంసా పట్టణానికి వెళ్తున్న ఆటోలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో డ్రైవర్ తప్పించుకున్నాడు. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎండ తీవ్రత వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

కెమెరాలో వన్యప్రాణులు

జన్నారం: వన్యప్రాణుల గణనలో భాగంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో ఇటీవల కెమెరాలు అమర్చారు. ఇందులో అనేక వన్యప్రాణులు కనిపించినట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అమర్చిన కెమెరాలో అడవి దున్నలు, నీలుగాయిలు, చుక్కల దుప్పలు, నెమళ్లు చిక్కాయి. అత్యధికంగా చుక్కల దుప్పలు పిల్లలతో కనిపించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.



తల్లితో చుక్కల దుప్పి పిల్ల



నెమలి



చుక్కల దుప్పి



అడవి దున్న

కలియదున్నితే భూసారం

- వరి కొయ్యలు కాల్చితే కాలుష్యం
- దిగుబడిపై ప్రభావం

లోకేశ్వరం: వరి కోతలు పూర్తవుతున్నాయి. వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పొలాన్ని దుక్కి దున్నడానికి అడ్డంగా ఉన్న వరి కొయ్యలను కాల్చడంలో నిమగ్నమయ్యారు. కొయ్యలు తగలబెడితే వెలువడే పొగతో వాతావరణ కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాలు నశిస్తాయి. పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో సేద్యం కష్టమవుతుంది. ఈ విపత్తును తప్పించడానికి రైతులంతా కొయ్యలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో యాసంగి సీజన్ పూర్తికానుంది. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు యంత్రాలతో కోతలు చేపట్టారు. పొలాల్లో వరి కొయ్యలతోపాటు పంట వ్యర్థాలు మిగిలిపోయాయి. వీటిని తొలగించి పొలాన్ని దుక్కి దున్నడానికి కొయ్యలను తగలబెడుతున్నారు. కలియదున్నాలంటే చాలా సమయం పడుతుందని, ఖర్చుతో కూడుకుందని భావిస్తున్నారు. ఒక్కసారి మంట అంటిస్తే గంటలో కాలిపోతుందనే ఆలోచనలో ఉన్నారు. ఈనేపథ్యంలో రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.



ధర్మోరలో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో కాలిన పైపులు

ఉపయోగాలు..

- కలియ దున్నడంతో వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- నత్రజని, భాస్వరం, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతంది.
- భూసారం పెరిగితే యాసంగిలో వాడే ఎరువులను 30 నుంచి 40 శాతం తగ్గించుకోవచ్చు.
- వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుంది.

ఇలా చేయాలి..

- పొలాన్ని రోటవేటర్‌తో కలియదున్నాలి. వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి.
- కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతాయి.

నష్టాలు..

- వరికొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజగుణాన్ని కోల్పోతుంది.
- నేలలో సహజసిద్ధంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి.
- నత్రజనిలాంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి.
- కొన్నేళ్లుగా భూసారమంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది.
- కాల్చడంతో వచ్చే దట్టమైన పొగతో రైతు ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మంటలు పెద్దవైతే పక్కనే గల ఇతర పంటలు వస్తువులు కాలిపోతాయి.

కాల్చడం మానేశాను



గతంలో అవగాహన లేక వరికొయ్యలను కాల్చేవాళ్లం. వ్యవసాయాధికారుల సూచనతో మానేశాం. ఇప్పుడు దుక్కితో దున్నేసి సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నాం. భూసారం పెరుగుతోంది. పంటకు అవసరమైన పోషకాలు దొరుకుతున్నాయి.

– మామిడి సునీల్‌రెడ్డి, ధర్మోర రైతు

అవగాహన కల్పిస్తున్నాం



వరి కొయ్యలు కాల్చవద్దని రైతులకు సూచిస్తున్నాం. దీని వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. అవగాహన ఉన్నవారు కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకుంటున్నారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- మూడు విడతల్లో ప్రవేశాలు

బోథ్: తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు ఉన్నత విద్యామండలి శుక్రవారం వివరాలు వెల్లడించింది. ప్రవేశాల ప్రక్రియను మూడు విడతల్లో పూర్తి చేయనుంది. ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించిన సీట్లు భర్తీ చేయనుంది. శనివారం నుంచి విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్, మీసేవా, టీ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 91 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి

ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందే విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. రెండు, మూడు విడతలో సీట్లు పొందే వారు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అలా చేయకపోతే సీటు రద్దవుతుంది. ఫస్ట్ సెమిస్టర్ తరగతులు జూన్ 30 నుంచి ప్రారంభమవుతాయి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

- ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ వెబ్‌సైట్‌లో www.dost.cgg.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కళాశాలలను ఎంచుకోవాలి. ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. సీట్లు మిగిలితే స్పెషల్ ఫేజ్ నోటిఫికేషన్లు వస్తాయి. వీటిపై ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంటుంది.
- దోస్త్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల అప్‌డేట్స్ తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ల ఫీజుతోపాటు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, అలాట్‌మెంట్ కాపీలు పొందటం వంటి ప్రక్రియలు పూర్తి చేసుకోవచ్చు.

ప్రవేశాలు ఇలా..

- డిగ్రీలో మూడు విడతల ద్వారా ప్రవేశాలకు అవకాశం.
- మొదటి ఫేజ్‌లో భాగంగా నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ తుది గడువు. ఈనెల 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 29న మొదటి ఫేజ్ సీట్ల కేటాయింపు ఉంటుంది.
- రెండోవిడత కింద ఈనెల 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. జూన్ 19 తుది గడువుగా నిర్ణయించింది. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఉత్తీర్ణత సాధించేలా తరగతులు నిర్వహించాలి

ఇంద్రవెల్లి: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని లింమ్‌గూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మే నెల పూర్తిగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలపై నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు మధుకర్, ప్రమీల, దళిత్ తదితరులు ఉన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

ఆర్టీఐ పేరిట డబ్బులు డిమాండ్

- ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలపై ఆర్టీఐ వేసి డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని విద్యానగర్‌లో చాణక్య పాఠశాలకు సంబంధించి భుక్తాపూర్‌కు చెందిన ఎండీ అర్షద్, షేక్ సమద్, తాటిగూడకు చెందిన షేక్ యూసుఫ్‌లు ఆర్టీఐ వేశారు. పాఠశాల యజమాని, మైనార్టీ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అమీరొద్దీన్ ఆ ముగ్గురిని ఆర్టీఐ వివరాలు ఇస్తానని ఇటీవల పిలిచాడు. తమకు ఆర్టీఐ వివరాలు వద్దని, తాము (ఐయూఎంఎల్) ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఏర్పాటు చేశామని, పార్టీ ఫండ్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు. శుక్రవారం ఎండీ అర్షద్, షేక్ యూసుఫ్, షేక్ సమద్‌లను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

జొన్నలేప తిని 20 ఆవులు మృతి

బజార్‌హత్నూర్: మేతకు వెళ్లిన ఆవులు జొన్న లేప తిని మృత్యువాతపడ్డాయి. మండలంలోని బుర్కపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. గ్రామంలో 45 ఆవులు శుక్రవారం పశుగ్రాసం మేయడానికి వెళ్లాయి. పంట చేనులో జొన్న లేప (కోత తర్వాత జొన్న కాండానికి మొలిచిన మొలకలు) తిని 20 ఆవులు మృతిచెందాయి. మిగతా ఆవులకు సకాలంలో వైద్య చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఏఎస్సై లింబాజీ ఘటనస్థలానికి చేరుకుని మృతిచెందిన ఆవులను పరిశీలించారు. కాగా బర్దవల్ నానక్‌సింగ్‌కు చెందిన 3 ఆవులు, టాక్ష నానక్‌సింగ్ 4, హూషార్‌సింగ్ 2, కపూర్‌చంద్ 2, గులాబ్ సింగ్, గురువేసింగ్, చందర్‌సింగ్, న్యాల్‌సింగ్, సుభాష్, బాన్య రామ్, బామన్ పరుశురాం, హరిసింగ్, గోపిచంద్‌లకు చెందిన ఒక్కొక్క ఆవులు మృతి చెందాయి.



ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరేసుకున్నాడు. మద్యానికి బానిసైన యువకుడు ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

భార్య కాపురానికి రావడం లేదని..



రవికిరణ్ మృతదేహం

తానూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన బన్సోడే రవికిరణ్ (34)కు ముథోల్ మండలం సరస్వతినగర్‌కు చెందిన జ్యోతితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కలగడం లేదని బాధతో రవికిరణ్ మద్యానికి బానిసయ్యాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గతేడాది జ్యోతి సరస్వతినగర్‌కు వెళ్లింది. అప్పటి నుంచి తండ్రి సుభాష్‌తో రవికిరణ్ ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య కాపురానికి రాకపోవడం, ఒంటరి జీవితం భరించలేక తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తండ్రి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



దుర్గాప్రసాద్ మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, రవీంద్రఖని రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్‌కు చెందిన పైడి దుర్గా ప్రసాద్ (28) మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శంకరమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కోసం వినతి



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కుటుంబీకులు, నాయకులు

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు గ్రామానికి చెందిన సింగం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ఆయన రెండేళ్లుగా ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. కుటుంబీకులు, టీపీసీసీ రాష్ట్ర మహిళా నాయకురాలు అల్లూరి కృష్ణవేణి ప్రత్యేక చొరవతో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ప్రవాసీ ప్రజావాణిలో కేంద్రం ఇన్‌చార్జి అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గల్ఫ్ కార్మికుడి ఆచూకీ కనుగొని వెంటనే ఇండియాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులతో కలిసి విన్నవించారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలు రేఖాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ



సీసీ పుటేజీలో గుర్తుతెలియని వ్యక్తి

బాసర: మండలంలోని టాక్లి గ్రామంలోని గిరిజనవాడలో శుక్రవారం వేకువజామున దావనే గంగాధర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.30 వేల నగదు, తులం బంగారం వస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గంగాధర్ ఇంటి పక్కన ఉన్న జారీకొట్ బాబురావు ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలో గుర్తుతెలియని వ్యక్తులు చిక్కారు. వీరిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు

- మహిళపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టుచేసిన మహిళపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పతంగె స్వప్న ఇన్‌స్టాగ్రామ్‌లో కత్తులతో పోస్టు చేయడంపై పోలీసులు సుమోటోగా తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

లక్సెట్టిపేట వరకు జాతీయ రహదారి పొడిగించాలి

- జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు
- ఎంపీ గోడం నగేశ్‌కు వినతి

జన్నారం: జాతీయ రహదారిని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించేలా చూడాలని జన్నారం మండల అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముంబయి నుంచి నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు ఉన్న జాతీయ రహదారిని అటవీ అనుమతులు తీసుకుని కడెం, జన్నారం, దండేపల్లి మీదుగా లక్సెట్టిపేట వరకు పొడిగించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 5న ఆదిలాబాద్‌కు వస్తున్నారని, ఆయన దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా రహదారుల గుండా వాహనాల రాకపోకలపై అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసి, రాకపోకలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జన్నారంలో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విన్నవించినట్లు తెలిపారు. జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య, కో కన్వీనర్ కోదూరి చంద్రయ్య, బీసీ సంఘం అధ్యక్షులు గూడ అశోక్, పెరక సంఘం అధ్యక్షులు ఎంబడి సత్తన్నతోపాటు మేనేని శ్రీనివాస్ రావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు షబ్బీర్ పాషా, మైనార్టీ నాయకులు షేక్ అక్బర్ పాల్గొన్నారు.



ఎంపీ నగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల అభివృద్ధి కమిటీ నాయకులు

వీహబ్ ప్రతినిధులతో చర్చ

బాసర: విద్య, పరిశోధన, సాంకేతిక రంగాలతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం పరస్పర సహకారం అందించేందుకు బాసర ఆర్జీయూకేటీ, వీహబ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై చర్చలు జరిగాయి. బాసర ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ సమక్షంలో వీహబ్ ప్రతినిధులు, ఓఎస్డీ, ఏవోలతో చర్చించారు. ఈ ఒప్పందం ద్వారా విద్య మౌలిక సదుపాయాలు, పరిశోధనకు ప్రోత్సాహం, శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త ప్రాజెక్టులు వంటి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, వీహబ్ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ దిల్బార్, అసోసియేట్ డీన్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

256 క్వింటాళ్ల జొన్నలు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలను ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు మాదపూర్‌లో శివారులో సజ్జద్ రేకులషెడ్డులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న జొన్నలు లభ్యమయ్యాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న జొన్నలను సీజ్ చేసి వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మాదపూర్‌లో జొన్నలు పట్టుకున్న పోలీసులు

జొన్నలు తరలిస్తున్న ట్రాలీ వాహనం..

ఇంద్రవెల్లి: అక్రమంగా జొన్నలను ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా మండలంలోని హీరాపూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు వ్యవసాయ మార్కెట్, రెవెన్యూ అధికారులు తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని ఏమాయికుంటకు చెందిన వ్యాపారి నారాయణ ట్రాలీలో జొన్నలు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చెక్‌పోస్ట్ వద్ద ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 45 క్వింటాళ్ల జొన్నలను సీజ్ చేశారు. ఆ జొన్నలను ప్రభుత్వ గోదాంలో భద్రపర్చగా, ట్రాలీ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు.